సాక్షి ఖమ్మం

మంగళవారం । 12 । ఆగస్టు । 2025



కేజీబీవీలకు ఆదరణ

జిల్లాలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఇంటర్‌లో ప్రవేశాలు పెరిగాయి.

8లో



ఆదిలోనే అంతరాయం

సాగర్ కాల్వల్లో పూడిక పేరుకుపోవడం, కాల్వ కట్టలు బలహీనంగా మారడంతో నీటి సరఫరా సాఫీగా సాగడం లేదు.

8లో

గరిష్టం / కనిష్టం

32° / 24°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

జిల్లా జడ్జిని కలిసిన సబ్‌కలెక్టర్



జిల్లా జడ్జికి మొక్క ఇస్తున్న అజయ్‌యాదవ్

ఖమ్మంలీగల్: కల్లూరు సబ్‌కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అజయ్‌యాదవ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్‌ను సోమవారం కలిశారు. జిల్లా కోర్టులో న్యాయమూర్తిని ఆయన మర్యాదపూర్వకంగా కలవగా వివిధ అంశాలపై చర్చించారు.

రేపు డిగ్రీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఖమ్మం సహకారనగర్: రానున్న స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా స్థాయిలో డిగ్రీ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఖమ్మం ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ మొహమ్మద్ జాకీరుల్లా తెలిపారు. కళాశాల చరిత్ర విభాగం, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యాన 'భారతదేశ స్వాతంత్రోద్యమం – ప్రపంచానికి ఆదర్శం' అంశంపై వ్యాసరచన పోటీ ఈనెల 13న ఉంటుందని వెల్లడించారు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో రాసే అవకాశం ఉండగా, వివరాలకు 79819 52341, 7731944849 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరి



అల్బెండజోల్ మాత్ర వేస్తున్న జెడ్పీ సీఈఓ దీక్ష

ఏన్కూరు: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండాలని జెడ్పీ సీఈఓ దీక్షారైనా సూచించారు. ఏన్కూరులోని గురుకుల విద్యాలయం, కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల పరిసరాలు, మరుగుదొడ్లు, డార్మెటరీలతో పాటు మధ్యాహ్న భోజనం అమలుతీరును పరిశీలించాక మాట్లాడారు. విద్యార్థులు పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని.. తద్వారా శ్రద్ధగా చదువుకోవచ్చని తెలిపారు. కాగా, విద్యార్థులకు సీఈఓ నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ప్రభుత్వ వైద్యాధికారులు బి.రాములు, మౌనిక, ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరెడ్డి, ప్రత్యేకాధికారి లావణ్య, హెచ్‌ఎం రాఘవరావు పాల్గొన్నారు.

రైతు బీమా అర్హుల జాబితా ప్రదర్శన

ఖమ్మంవ్యవసాయం: రైతు బీమా పథకం ఎనిమిది పాలసీకి అర్హులైన రైతుల జాబితాలను వ్యవసాయ శాఖ అధికారులు మండలాల వారీగా విడుదల చేశారు. ఈ జాబితాలను ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించగా, అర్హులైన రైతులు తమ దరఖాస్తులకు ధ్రువపత్రాలు జత చేసి రైతు వేదికల్లో ఏఈఓలకు అందజేయాల్సి ఉంటుంది. కాగా, అర్హులైన రైతులు సకాలంలో రైతు బీమా పథకానికి నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.



సీజన్‌లో నిండా మిర్చి బస్తాలతో ఇలా..




షెడ్లు తొలగించడంతో బోసిపోయి కనిపిస్తున్న యార్డు

రేపటి అభివృద్ధి కోసం..

విదేశాలకు మిర్చి ఎగుమతి చేసే వ్యాపారులు ఖమ్మంలో ఉండడంతో ఇక్కడి వ్యవసాయ మార్కెట్‌కు తెలంగాణలోని పలు జిల్లాల నుంచే కాక ఏపీ నుంచి సైతం రైతులు మిర్చిని తీసుకొస్తారు. లక్షలాదిగా మిర్చి బస్తాలు వచ్చే సీజన్‌లో కాలు పెట్టే స్థలం కూడా లేక ఇక్కట్లు ఎదురవుతుండడంతో మోడల్ మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.155 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఏడు భారీ షెడ్లు, కోల్డ్ స్టోరేజీలు, రైతుల విశ్రాంతి భవన నిర్మాణం పనులు మొదలయ్యాయి. ఇందుకోసం పాత యార్డులు, వేర్ హౌస్‌లు పూర్తిగా తొలగించడంతో మార్కెట్ యార్డు ఇలా బోసిపోయి కనిపిస్తోంది. మళ్లీ జనవరిలో మొదలయ్యే సీజన్ నాటికి మోడల్ మార్కెట్ నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ఆర్టీసీకి కలిసొచ్చింది..

రద్దీలోనూ మహాలక్ష్మి

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు విపరీతమైన రద్దీలోనూ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని విజయవంతంగా అమలు చేశారు. రక్షా బంధన్ పండుగ రోజు రీజియన్ వ్యాప్తంగా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 1.50 లక్షల మంది మహిళామణులు ప్రయాణించారు. ఈరోజు మొత్తంగా 2లక్షల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఇక ఆదివారం అదనంగా 137 సర్వీసులు నడిపించారు. కాగా, రీజియన్‌కు రికార్డు స్థాయిలో కేవలం ప్రత్యేక సర్వీసుల ద్వారానే రూ.1.21 కోట్ల ఆదాయం నమోదుకాగా.. అత్యధికంగా మధిర డిపో నుంచి రూ.29.84 లక్షల ఆదాయం సమకూరింది.

నాలుగు రోజుల్లో డిపోల వారీగా ఆదాయం (ప్రత్యేక సర్వీసుల ద్వారా)

డిపో	కిలోమీటర్లు	ఆదాయం (రూ.లక్షల్లో)
మధిర	42,316	29.84
భద్రాచలం	42,958	25.81
ఖమ్మం	38,022	20.99
సత్తుపల్లి	26,122	15.58
మణుగూరు	24,096	12.05
కొత్తగూడెం	15,155	9.16
ఇల్లెందు	11,797	7.88
మొత్తం	2,00,466	121.35

వరుస సెలవులతో ప్రయాణికుల రద్దీ

- నాలుగు రోజుల్లో రూ.1.21 కోట్ల ఆదాయం
- అత్యధికంగా మధిర నుంచి రూ.29.84 లక్షలు

ఖమ్మంమయూరిసెంటర్: శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వత్రం, రాఖీ పౌర్ణమి రెండో శనివారం.. ఆ తర్వాత ఆదివారం కావడంతో జనమంతా ఊర్ల బాట పట్టడం ఆర్టీసీకి కలిసొచ్చింది. ఈనెల 7నుంచి 10వ తేదీ వరకు ఆర్టీసీ ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల ద్వారా 374 బస్సులు నడిపించారు. ఆ బస్సుల్లో లక్షలాది మందిని గమ్యస్థానాలకు చేర్చడంతో కాసుల పంట పండింది.

ప్రణాళికాయుతంగా..

ఈనెల 8న శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం జరుపుకోగా విద్యాసంస్థలకు ఆప్షనల్ హాలీడే ఇచ్చారు. ఆ మరుసటి రోజు రాఖీ పండుగ, ఆపై ఆదివారం కలిసొస్తుండడంతో చాలా మంది 7వ తేదీనే సొంత ఊర్లకు పయనమయ్యారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఈనెల 7, 8, 9వ తేదీల్లో హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోలకు ప్రత్యేక బస్సులను నడిపారు. ఇక 9వ తేదీన హైదరాబాద్‌తో పాటు జిల్లాలో రద్దీ ఉన్న ప్రాంతాలకు బస్సులు తిప్పారు. అంతేకాక 10వ తేదీ ఆదివారం ఉమ్మడి జిల్లా నుంచి హైదరాబాద్‌కు తిరుగుప్రయాణం అయ్యేవారి కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడిపిస్తూ బస్టాండ్లలో అదనపు సిబ్బంది ద్వారా పర్యవేక్షించడంతో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాలేదు.



రాఖీ పండుగ రోజున ఖమ్మం పాతబస్టాండ్‌లో రద్దీ

రద్దీకి అనుగుణంగా సర్వీసులు

రాఖీ పండుగ, మహాలక్ష్మి పథకం అమలు నేపథ్యాన ప్రయాణికులకు ఇబ్బంది రాకుండా ముందుస్తు చర్యలు తీసుకున్నాం. ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించాలని ఉద్యోగులకు సూచనలు చేశాం. డిప్యూటీ ఆర్‌ఎం, డిపో మేనేజర్లతో పాటు నేను కూడా బస్టాండ్లలో పర్యవేక్షిస్తూ రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటుచేయడంతో ఏ సమస్యా రాలేదు.

– ఏ.సరిరామ్, ఆర్‌ఎం, ఖమ్మం రీజియన్

9వ తేదీన ఓఆర్.. 112



సత్తుపల్లి బస్టాండ్‌లో పరిశీలిస్తున్న ఆర్‌ఎం, అధికారులు

సత్తుపల్లిటౌన్: వరుస సెలవులతో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఖమ్మం రీజియన్‌లో అదనపు సర్వీసులు నడిపించామని రీజినల్ మేనేజర్ సరిరామ్ తెలిపారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపో, బస్టాండ్‌తో పాటు మందలపల్లి, అశ్వారావుపేట బస్టాండ్లను సోమవారం పరిశీలించిన ఆయన సత్తుపల్లిలో మాట్లాడారు. రాఖీ పండుగ రోజున రీజియన్‌లో ఓఆర్ 112గా నమోదైందని తెలిపారు. హైదరాబాద్ నుంచి రాఖీ పౌర్ణమికి వచ్చే ప్రయాణికుల కోసం 7, 8వ తేదీల్లో 102 అదనపు సర్వీసులు, సత్తుపల్లి–ఖమ్మం మధ్య అదనంగా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులను నడిపించామని ఆర్‌ఎం వెల్లడించారు. డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, ఉద్యోగులు ఎస్.సాహితి, బాలస్వామి, వెంకటయ్య, ఆనంద్, ఆనందం పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే ఎస్సెస్సీ పరీక్షలు

80 మార్కులకు పరీక్ష.. ఇంటర్నల్ మార్కులు 20

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి విద్యార్థులకు పాత విధానంలో వార్షిక పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ఏడాది వరకు 80మార్కులు పరీక్ష ద్వారా, 20మార్కులు ఇంటర్నల్ అసెస్‌మెంట్ ద్వారా కేటాయించేవారు. కానీ ఇంటర్నల్ మార్కుల కేటాయింపులో కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాయంటూ ప్రభుత్వం గతేడాది పరీక్షల సమయాన 100 మార్కులకు పరీక్ష నిర్వహించాలని నిర్ణయించింది. అయినా ఇది అమలుకు నోచుకోలేదు. ఇక ఈ విద్యాసంవత్సరం మాత్రం ఇంటర్నల్ మార్కులు తొలగిస్తామని ముందు నుంచి చెబుతుండగా.. మళ్లీ పాత పద్ధతిలోనే నిర్వహించేలా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ సోమవారం ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. జిల్లాలోని 212 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 6,500మంది పదో తరగతి చదువుతుండగా, వీరికి థియరీతో పాటు ఇంటర్నల్ మార్కుల విధానాన్ని అమలుచేస్తారు.

ఇప్పటికే పూర్తయిన ఎఫ్‌ఏ–1

పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే ఫార్మేటివ్ అసెస్‌మెంట్(ఎఫ్‌ఏ)–1 పరీక్షలు పూర్తయ్యాయి. మొత్తం నాలుగు విడతలుగా ఎఫ్‌ఏ పరీక్షలు నిర్వహించి.. ప్రత్యేక బృందాల ద్వారా జవాబుపత్రాల పరిశీలన చేపడుతారు. పరీక్షల్లోని మార్కుల ఆధారంగా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి ఇంటర్నల్ మార్కులు కేటాయిస్తారు. ఆపై మిగతా 80మార్కులకు వార్షిక పరీక్షలు నిర్వహిస్తారు. ఈవిషయమై జిల్లా పరీక్షల బోర్డు(డీసీఈబీ) కార్యదర్శి కనపర్తి వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటర్నల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా పర్యవేక్షిస్తామని తెలిపారు.

అల్బెండజోల్‌తో రక్షణ



విద్యార్థితో మాత్ర మింగిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మంవైద్యవిభాగం: చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు అవరోధంగా నిలుస్తున్న నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వెల్లడించారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఖమ్మం ఎన్నెస్పీ క్యాంప్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆయన మాత్రలు అందజేసి మాట్లాడారు. జిల్లాలో 3,11,317 మంది పిల్లలకు మాత్రల పంపిణీకి ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఎవరైనా మిగిలిపోతే 18వ తేదీన అందిస్తామని చెప్పారు. డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ చందూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంతా అప్రమత్తంగా ఉండండి..

- ఈనెల 14నుంచి భారీ వర్షాలకు అవకాశం
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఈనెల 14నుంచి 17వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశముందున్న వాతావరణ శాఖ సూచనలతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. ప్రజావాణిలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించాక అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లపై సూచనలు చేయడంతో పాటు మంగళవారం సాయంత్రంలోగా శాఖల వారీగా ఉత్తమ ఉద్యోగుల జాబితా సమర్పించాలని సూచించారు. అలాగే, ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. కాగా, వార్తాపత్రికల్లో ప్రచురితమయ్యే ప్రభుత్వ వ్యతిరేక వార్తలను అధికారులు సమీక్షించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. తొలుత అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో కలిసి ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్.. పరిశీలన, పరిష్కారంపై సూచనలు చేశారు. డీఆర్వో పద్మశ్రీ, డీఆర్‌డీఓ సన్యాసయ్య, కలెక్టరేట్ ఏఓ కారుమంచి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- వైరా మున్సిపాలిటీ ఎస్సీ కాలనీకి చెందిన డి.రాంబాబు ఇంటి నంబర్ మంజూరు చేయాలని కోరారు.
- మధిరకు చెందిన డి. వెంకటమ్మ తన భర్త కలెక్టరేట్‌లో స్వీపర్‌గా పనిచేసిన కాలానికి ధృవీకరణ పత్రం ఇప్పించాలని కోరారు. అలాగే, కొణిజర్ల మండలం పల్లిపాడు హైస్కూల్ స్వీపర్‌గా పనిచేసిన వెంకటేశ్వర్లు తనకు మళ్లీ అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.
- రఘునాథపాలెం మండలం పువ్వాడనగర్‌కు చెందిన షేక్ బీబమ్మ, కట్ల మోహన్, నల్ల నీలవేణి తదితరులు తమ పేర్లు ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో ఉన్నందున మంజూరు పత్రాలు ఇప్పించాలని కోరారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ అనుదీప్, పక్కన అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

సమస్య పరిష్కరించండి



ఖానాపురం హవేలీ పరిధిలో మా అమ్మ కాంతమ్మ పేరుతో 150 చదరపు గజాల ఇళ్ల స్థలాన్ని 1997లో కేటాయించారు. కానీ ఇప్పటి వరకు స్థలాన్ని స్వాధీనం చేయలేదు. సర్వేయర్ పరిశీలించినందున యంత్రాంగం స్థలాన్ని అప్పగించాలి.

– పేరం దాసయ్య, ఎక్స్ సర్వీస్‌మెన్, టీరోలు

రాజీవ్ స్వగృహ టౌన్‌షిప్ వేలం



పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్, అధికారులు

ఖమ్మంరూరల్: పోలేపల్లిలోని రాజీవ్ స్వగృహ ఆధ్వర్యాన పూర్తయిన, నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనాలను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ స్వగృహ భవన సముదాయాన్ని కలెక్టర్ సోమవారం పరిశీలించారు. అనంతరం వివిధ కంపెనీల ప్రతినిధులు, బిల్డర్లతో సమావేశమై మాట్లాడారు. ఇక్కడ నివాసముండే వారికి మున్నేటి వరద నుంచి ఇబ్బంది రాకుండా రిటైనింగ్‌వాల్ నిర్మిస్తామని తెలిపారు. ఎనిమిది బ్లాక్‌లు, తొమ్మిది ఫ్లోర్లు, ఫ్లోర్‌కు ఎనిమిది ఫ్లాట్ల చొప్పున 576 ఫ్లాట్లు ఉన్నాయని చెప్పారు. ఆసక్తి ఉన్న సంఘాలు, బిల్డర్లు, డెవలపర్లు సెప్టెంబర్ 6లోగా టెండర్ దాఖలు చేయాలని తెలిపారు. కాగా, మున్సిపాలిటీ వారు బఫర్ జోన్‌లో నిర్మాణాలను కూల్చివేస్తుండగా, మున్నేటి పక్కన స్వగృహ టౌన్‌షిప్ పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నించగా రిటైనింగ్ వాల్ నిర్మాణంతో అధికారికంగా అనుమతి ఇచ్చినట్లే అవుతుందని కలెక్టర్ తెలిపారు. హౌసింగ్ కార్పొరేషన్ ఎస్‌ఈ భాస్కర్‌రెడ్డి, ఈఈ నరేందర్‌రెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



రన్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ, డీవైఎస్‌ఓ

ఖమ్మంవైద్యవిభాగం/ఖమ్మం స్పోర్ట్స్: ప్రతి ఒక్కరు ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి సూచించారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియం వద్ద సోమవారం ఆమె 5కే రన్‌ను డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. యువత ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవడమే అనర్థాలను ఇంకొందరికి వివరించాని సూచించారు. కాగా, రన్‌లో 100 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొనగా బాలికల విభాగంలో ఎస్.కే.ఆఫ్రిన్, నాగజ్యోతి, బాలుర విభాగంలో అనిల్, ఎస్.గోపీచంద్ మొదటి రెండు స్థానాల్లో నిలవడంతో నగదు బహుమతులు అందజేశారు. ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ శాఖ, వివిధ కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు డి.సత్యకుమార్, ఎం.డీ.అలీ, వీరయ్య, రామకృష్ణ, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో వైద్యాధికారుల నియామకానికి మెరిట్ జాబితా విడుదల చేశామని డీసీహెచ్‌ఓ డాక్టర్ కె.రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. ఈనెల 6న నిర్వహించిన ఇంటర్వ్యూల్లో ఎంపిక చేసిన వారితో సిద్ధం చేసిన జాబితాను https:// khammam. telangana. gov. in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని వెల్లడించారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఈనెల 14లోగా సమర్పించాలని ఆయన సూచించారు.

ఆలయ నిర్వహణ, అభివృద్ధికి రూ.5 లక్షలు



నాగరాజును సన్మానిస్తున్న కమిటీ బాధ్యులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జీవీఆర్ పార్కు ఎదురుగా ఉన్న శ్రీహరిహరాత్మజ అయ్యప్పస్వామి ఆలయ నిర్వహణ, అభివృద్ధికి బెంగళూరుకు చెందిన భక్తుడు సోమవారం రూ.5లక్షలు అందజేశారు. వాసవీ కన్‌స్ట్రక్షన్స్ అధినేత గాదంశెట్టి నాగరాజు ఈ నగదు అందజేశాక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆల య కమిటీ చైర్మన్ దోసపాటి అమరలింగేశ్వరరావు, బొంతు శ్రీనివాసరావు, అర్చకులు సురేష్ ఆచార్యులు పాల్గొన్నారు.

ఊరచెరువుకు బుంగ



చెరువుకు బుంగ పడిన ప్రదేశం

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామ ఊరచెరువుకు బుంగ పడడంతో నీరు వృథాగా పోతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుకట్ట తూము వద్ద పెద్దఎత్తున బుంగ పడింది. దీంతో నీరు వృథా అవుతున నేపథ్యాన అధికారులు మరమ్మతు చేయించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

పలుచోట్ల ఓ మోస్తరు వాన

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం ఉదయం 8-30నుంచి సోమవారం ఉదయం 8-30 గంటల వరకు వాతావరణ శాఖ ప్రకటించిన వివరాల ప్రకారం జిల్లాలో సగటున 20.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధి కంగా బోనకల్ మండలంలో 58.6 మి.మీ.గా నమోదవగా చింతకానిలో 49.4, కల్లూరులో 38.4, కొణిజర్లలో 33.4, పెనుబల్లిలో 32.2, కూసుమంచిలో 31.8, తల్లాడలో 29.2, నేలకొండపల్లిలో 28.4, కామేపల్లిలో 20.8 మి.మీ. వర్షపాం నమోదైందని వెల్లడించారు. అలాగే, వైరా, తిరుమలాయపాలెం, సత్తుపల్లి, ఖమ్మం అర్బన్, మధిర, ఖమ్మం రూరల్, ముదిగొండ, రఘునాథపాలెం, ఏన్కూరు, సింగరేణి మండలాల్లోనూ వర్ష ప్రభావం కనిపించింది. ప్రస్తుతం కురుస్తున్న వాన సాగులో ఉన్న పత్తి, వరి, ఇతర పంటలకే కాక వరినాట్లకు ప్రయోజనాన్ని కలిగిస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
కందులు	6,100	6,100
ఏసీ మిర్చి	14,400	8,000
మిర్చి	8,500	7,000
పత్తి	7,800	7,000

– ఖమ్మం వ్యవసాయం

కేజీబీవీలకు ఆదరణ..



కామేపల్లి మండలం పాత లింగాలలోని కేజీబీవీ

- కస్తూర్బా కళాశాలల్లో పెరిగిన అడ్మిషన్లు
- ఫలితమిచ్చిన ఇంటింటి ప్రచారం
- ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 8,234 మంది చేరిక

పాల్వంచరూరల్: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు.. అందుతున్న బోధన సత్ఫలితాలను ఇస్తున్నాయి. కేజీబీవీల్లో విద్యార్థినులకు ఉచిత భోజనం, వసతి, దుస్తులు ఇవ్వడంతో పాటు నాణ్యమైన బోధన అందుతోంది. గత వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయడంతో ఉమ్మడి జిల్లాలోని 28 కస్తూ ర్బాగాంధీ కళాశాలల్లో ఈ ఏడా ది ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పెరిగా యి. కొన్ని కళాశాలల్లో కొంత మేర తగ్గినా.. మొత్తంగా చూస్తే ప్రవేశాల సంఖ్య పెరిగిందని అధికారులు తెలిపారు.

మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలోని కేజీబీవీల్లో 8,234 మంది విద్యార్థినులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరారు. భద్రాద్రి జిల్లాలోని కేజీబీవీల్లో 3,719 మంది చేరగా, ఖమ్మం జిల్లా కేజీబీవీల్లో 4,515 మంది ప్రవేశాలు పొందారు. అయితే, ప్రవేశాలు పెరిగినా ఉమ్మడి జిల్లాలోని కేజీబీవీల్లో ఇంకా 544 సీట్లు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలోని ఎర్రుపాలెంలో 23, పెనుబల్లి 34, సింగరేణి 20, లింగాల 24, బోనకల్ 24, కూసుమంచి 23, ఏన్కూరు 14, కొణిజర్ల 15, ముదిగొండలో ఎనిమిది ఖాళీగా ఉన్నాయి.

జిల్లాలోని కేజీబీవీల్లో గత ఏడాది, ఈ ఏడాది ప్రవేశాలు

	2024 - 25	2025 - 26
ఎర్రుపాలెం	277	283
పెనుబల్లి	219	300
సింగరేణి	309	341
లింగాల	291	263
బోనకల్	289	318
కూసుమంచి	302	334
ఏన్కూరు	317	329
కొణిజర్ల	281	288
ముదిగొండ	311	330
చింతకాని	330	334
ఖమ్మం	317	352
రఘునాథపాలెం	300	330
తిరుమలాయపాలెం	359	354
కొత్తూరు (వై)	369	369
మొత్తం	4,271	4,515



ఎం.తులసి

ఆయా సీట్ల భర్తీకి ఈనెల 15 వరకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు సమగ్రశిక్షా అభియాన్ జీసీడీఓ ఎం.తులసి ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

240మందికి సైకిళ్లు, వెయ్యి మందికి యూనిఫామ్

పుట్టినరోజు సందర్భంగా అందించిన ఎమ్మెల్యే రాగమయి



విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రాగమయి దయానంద్

సత్తుపల్లి: అప్పట్లో ప్రభుత్వ పాఠశాలల్లో అరకొర సౌకర్యాలే ఉన్నా కష్టపడి చదువుకుని ఈ స్థాయికి చేరామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి వెల్లడించారు. ఊరి నుంచి మూడు తెలిపారు. ఎమ్మెల్యే రాగమయి దయానంద్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థినులకు 240 మందికి ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సైకిళ్లు పంపిణీ చేశారు. అలాగే, సత్తుపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్, డిగ్రీ కళాశాలల్లో వెయ్యి మంది విద్యార్థులకు యూనిఫామ్, నోట్ పుస్తకాలు, వాటర్ బాటిళ్లు, బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైన 12 మందికి రూ.60వేల నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. అలాగే, పాతసెంటర్ హైస్కూల్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన డాక్టర్ ఇమ్మడి నిఖిల్ సహకారంతో 45మందికి రూ.వెయ్యి విలువైన కిట్లు, మండల స్థాయి రూ.10వేల చొప్పున అందజేశాక ఎమ్మెల్యే మాట్లాడారు. మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్, నాయకులు గాదె చెన్నారావు, దొడ్డా శ్రీనివాసరావు, వందనపు సత్యనారాయణ, మలిరెడ్డి మురళీరెడ్డి, తోట సుజలరాణి, ఎం.డీ.కమల్‌పాషా, నారాయణవరపు శ్రీని వాస్, చల్లగుళ్ల నర్సింహారావు మున్సిపల్ కమిషనర్ నర్సింహ, తహసీల్దార్ సత్యనారాయణ, పాల్గొన్నారు. కాగా, ఎమ్మెల్యే రాగమయికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

టేబుల్ టెన్నిస్ ఉమ్మడి జల్లా జట్ల ఎంపిక



జిల్లా జట్లతో అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ జట్లను ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో సోమవారం ఎంపిక చేశారు. ఈమేరకు జట్ల వివరాలను టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్‌కుమార్, వీవీఎస్.సాంబమూర్తి తెలిపారు. అండర్–11 బాలుర జట్టులో అనుమోలు శ్రేయస్, జాయ్, ఈశ్వర్, హేమంత్ సాయి, నిహాల్ కృష్ణ, యశ్వంత్, రోషన్, బాలికల జట్టుకు బాలసాని హర్షికలక్ష్మి, పి.ఆరాధ్య, తోట జిజ్ఞాస, రోస్మిత, అండర్–13 బాలికల జట్టులో పర్స వంశిక, బాలసాని తన్మయిశ్రీ, బొంతు సాయిశివాని, బాలుర జట్టులో కోటగిరి హితేష్ శ్రీరంగా, ఈ.హరి, అభిలాష్, అన్వేష్, సాయి హర్షిత్ ఎంపికయ్యారని వెల్లడించారు. అలాగే, అండర్–15 బాలికల జట్టులో హర్షిత, అఖిల, స్పందన చంద్ర, చిలకబత్తిన పావని, బాలురు జట్టుకు షేక్ సాహెల్ ఫజల్, జి.చార్విక్, ఈ.తరుణ్, ఏ.ఉజ్వల్, ప్రజ్ఞ, అండర్–17 బాలురు జట్టుకు పరిటాల జ్వలిత్, పిట్టల మోహిత్ కృష్ణ, రామ్ సాకేత్, రణధీర్‌రెడ్డి, సైఫ్, అనస్, బాలికల జట్టులో గద్దల సిరి, పి.అమత, జి.చంద్రికరాణి, షర్మిలరాణి, సుప్రియ, అండర్–19 బాలికల జట్టులో బి.అఖిల, సౌమ్య, స్ఫూర్తి, రష్మీ, బాలురు జట్టులో జెస్సీ, ధనుష్, గుణ సోమశేఖర్ ఎంపికయ్యారని తెలిపారు. ఆయా జట్లు ఈనెల 22నుంచి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొంటాయని అసోసియేషన్ బాధ్యులు వెల్లడించారు.

నిరుద్యోగుల కోసం డీఈఈటీ యాప్



డీఈఈటీ వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత – ఉద్యోగావకాశాలు కల్పించే పరిశ్రమల నడుమ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ(డీఈఈటీ) యాప్ వారధిలా పని చేస్తుందని అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం వారు డీఈఈటీ యాప్ పనితీరుపై అధికారులతో సమీక్షించారు. నిరుద్యోగులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేస్తే వారి నైపుణ్యాలకు అనుగుణంగా పరిశ్రమలు అవకాశాలు కల్పిస్తాయని తెలిపారు. అంతేకాక ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్ షిప్, నైపుణ్య శిక్షణ సంస్థలు, జాబ్‌మేళాల వివరాలు అందుతాయని చెప్పారు.

జాయింట్ సర్వే చేయాలి

ఆర్ అండ్ బీ, ఎన్‌హెచ్, పంచాయతీరాజ్ అధికారులు రోడ్లనిర్మాణ సమయాన మిషన్ భగీరథ పైప్‌లైన్లు దెబ్బతినకుండా పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి సూచించారు. రోడ్ల మంజూరు సమయంలోనే సంయుక్తంగా సర్వే చేసి తాగునీటి పైప్‌లైన్ తరలింపు పనుల అంచనాలు కూడా పొందుపర్చాలని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొత్త సంఘాల ఏర్పాటుపై దృష్టి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా లేని మహిళలను గుర్తించి కొత్త సంఘాలు ఏర్పాటు చేయించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. ఖమ్మం టీటీడీసీ భవనంలో ఏపీఎంలు, సీసీలకు సెర్ప్ ఆధ్వర్యాన సోమవారం ఇచ్చిన శిక్షణలో ఆమె మాట్లాడారు. మహిళలతో పాటు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు, కిషోర బాలికలతో కొత్త సంఘాలు ఏర్పాటు చేయించాలని తెలిపారు. అనంతరం ఏపీఎంలు, సీసీ లతో ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్య, డీపీఎం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఏన్కూరు: గిరిజన సంక్షేమశాఖ విద్యాసంస్థల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డీ.ఎస్.నాగేశ్వరావు డిమాండ్ చేశారు. మండలంలోని మూలపోచారం పాఠశాలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆశ్రమ పాఠశాలలు, ప్రీ మెట్రిక్ వసతి గృహాల్లో హెచ్‌ఎంలు, సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థులు నష్టపోతున్నారని తెలి పారు. ఈనేపథ్యాన ఉపాధ్యాయుల బదిలీ లు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయులు పుల్లయ్య, బి.శోభన్, బి.రవి, బి.సింగ్యా, సుష్మిత, వి.రమేష్, ఉషశ్రీ పాల్గొన్నారు.

నిందితుడి అరెస్ట్

ఖమ్మంక్రైం: చోరీ కేసులో నిందితుడిని ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఖమ్మం సంభానీనగర్‌కు చెందిన వరికూటి విజయ్‌కుమార్ ఇంట్లో ఈనెల 5న చోరీ జరగగా దర్యాప్తు చేపట్టారు. ఈమేరకు ముస్తఫానగర్‌లో చేపట్టిన తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన చింతకాని మండలం గాంధీనగర్ వాసి నెటుకుమల్లి కృష్ణను ఆరా తీయగా చోరీకి పాల్పడింది తానేనని అంగీకరించారు. దీంతో 7.5 తులాల బంగారంతో పాటు వెండి, నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కరుణాకర్ తెలిపారు.

ఓటర్ల జాబితాలో మోసాలను వివరిస్తాం..

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: ఓటర్ల జాబితాలో కేంద్రప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వగా దుర్గాప్రసాద్ మాట్లాడారు. లోక్‌సభలో తమ నేత రాహుల్ గాంధీ బీజేపీ, ఎన్నికలసంఘం తప్పులను ఎండగట్టారని తెలిపారు. ఈ విషయమై నియోజకవర్గ, మండలకేంద్రాల్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పార్టీ శ్రేణులు, ప్రజలకు వివరించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. అంతేకాక ప్రతీ పోలింగ్ బూత్‌స్థాయిలో డిజిటల్ ఓటరు జాబితా తీసుకుని అక్రమాలపై నిలదీస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు రాపర్తిశరత్, మలీదు వెంకటేశ్వరరావు, లకావత్ సైదులు, పల్లెబోయిన భారతి, కాంగ్రెస్ నగర, మహిళా విభాగం అధ్యక్షులు మహ్మద్ జావేద్, దొబ్బల సౌజన్యతో పాటు కొండబాల కోటేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, వడ్డెబోయిన నరసింహరావు, వేజెండ్ల సాయికుమార్, మొక్కా శేఖర్‌గౌడ్, కొత్త సీతారాములు, బి.నాగరాజు, జెర్రిపోతుల అంజనీకుమార్, కన్నం ప్రసన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాటిక పోటీల్లో విజేత.. 'ఖరీదైన జైళ్లు'



బహుమతి అందిస్తున్న పోటీల నిర్వాహకులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలో నాలుగురోజుల పాటు జరిగిన తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీల్లో విజేతల వివరాలను నిర్వాహకులు ప్రకటించారు. కరీంనగర్ చైతన్యభారతి కళాసంస్థ ప్రదర్శించిన ఖరీదైన జైళ్లు, హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ వారు ప్రదర్శించిన అమ్మ చెక్కిన బొమ్మ, తాడేపల్లికి చెందిన అరవింద్ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన విడాకులు కావాలి నాటికలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. మొత్తం తొమ్మిది నా టికలు ప్రదర్శించగా రంగస్థల నటులు సుబ్బ రాయ శర్మ, మేక రామకృష్ణ, గోవిందరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈమేరకు మొదటి మూడు స్థానాల్లో నిలిచిన నాటికలు ప్రదర్శించిన సంస్థలు, ఉత్తమ దర్శకులు, నటులకు బహుమతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అన్నాబత్తుల సు బ్రహ్మణ్యకుమార్, మోటమర్రి జగన్మోహన్‌రావు, దేవేంద్ర, డాక్టర్ నాగబత్తిని రవి, వేల్పుల విజేత, నామ లక్ష్మీనారాయణ, వేముల సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఆదిలోనే అంతరాయం..

- శిథిలమైన సాగర్ కాల్వలతో ఇక్కట్లు
- పూడికకు తోడు గండ్లతో నీరు సాగక రైతుల ఆవేదన



కొదుమూరు వందనం లిఫ్ట్ వద్ద గత ఏడాది పడిన గుంతను వదిలేసిన దృశ్యం

ఖమ్మం అర్బన్: గతంతో పోలిస్తే ఈసారి నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి సాగు అవసరాలకు ముందుగానే నీరు విడుదల చేయడంతో ఆయకట్టు రైతులు సంతోషించారు. కానీ కాల్వల్లో అడ్డంకులు, శిథిలమైన లైనింగ్‌తో చివరి వరకు నీరు చేరే పరిస్థితి లేకపోవడం.. మార్గమధ్యలో గండ్లు పడే ప్రమాదం ఉండడంతో వారి ఆశలు ఆదిలోనే అడియాసలవుతున్నాయి. సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని బ్రాంచ్, మేజర్లు, మైనర్లు అనేకచోట్ల బలహీనంగా ఉండడం.. పూడిక, చెత్త, పిచ్చిమొక్కలతో నిండిపోవడం సాగు నీటి సరఫరాకు అడ్డంకిగా మారుతోంది. వేసవిలో శాశ్వత మరమ్మతులు చేయించాల్సి ఉన్నా తాత్కాలిక పనులతోనే సరిపెట్టడంతో ఇప్పుడు నీరు విడుదల చేయగానే లోపాలు బయటపడుతున్నాయి.

గత ఏడాది కూసుమంచిలో..

గతేడాది ఆగస్టు చివరి వారం భారీ వర్షాలతో సాగర్ ప్రధాన కాల్వకు వరద పోటెత్తింది. దీంతో కూసుమంచి వద్ద యూటీ తెగిపోగా భారీ నష్టం జరిగింది. రూ.కోట్లాది నిధులతో మరమ్మతులు చేసి ఇటీవలే నీరు విడుదల చేశారు. ఇంతలోనే వేంసూరు మండలం కుంచపర్తి సమీపాన కాల్వకు ఆదివారం భారీ గండి పడింది. గండి చుట్టూ మట్టి కొట్టుకుపోవడంతో సమస్య తీవ్రరూపం దాల్చింది. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే సీజన్ చివరి వరకు నీటి సరఫరా సాఫీగా సాగుతుందా, లేదా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సాగర్ ఆయకట్టు అధికారికంగా 2.54 లక్షల ఎకరాలు ఉండగా.. ఎత్తిపోతల పథకాలతో కలిపి 3లక్షల ఎకరాలకు పైగా సాగునీరు అందించాల్సి ఉంది. కానీ కాల్వల దుస్థితి, మరమ్మతు చేయకపోవడంతో ఎప్పుడేం జరుగుతుందోనన్న భయం అన్నదాతలను వెంటాడుతోంది.

తాత్కాలిక మరమ్మతులతోనే సరి

గత వానాకాలంలో పాలేరు నుంచి సాగర్ ప్రధాన కాల్వ మీదుగా పలుచోట్ల గండ్లు పడినా తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెట్టారు. ప్రధాన కాల్వతో పాటు బ్రాంచ్, మేజర్లు, మైనర్లలో పూడిక పేరుకుపోవడం, తూములు, షట్టర్లు ధ్వంసమవడం, చెట్లు పెరగడంతో నీటి ప్రవాహానికి అడ్డుగా నిలుస్తున్నాయి. ఏన్కూరు, కొణిజర్ల, తల్లాడ మండలాల్లో కాల్వల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. వంతెనలు శిథిలావస్థలో ఉండగా, రెగ్యులేటరీల షట్టర్లు ధ్వంసమై నీరు సాఫీగా సాగడం లేదు. ఉమ్మడి ఏపీగా ఉన్నప్పుడు ప్రపంచ బ్యాంకు నిధులతో సాగర్ కాల్వల ఆధునీకరణ పనులు చేసినా.. ఆతర్వాత పెద్ద ఎత్తున మరమ్మతులు జరిగిన దాఖలాలు లేవు. కొత్తగా నిధులు మంజూరు కాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది.

ఇసుక మేట మిగిలింది..



గండి పడిన చోట పొలాల్లో ఇసుక మేటలు

వేంసూరు: వేంసూరు మండలం కుంచపర్తి రెగ్యులేటరీ సమీపాన నాగార్జునసాగర్ కెనాల్‌కు ఆదివారం గండి పడిన విషయం విదితమే. దీంతో దాదాపు 20 ఎకరాల వరి పొలాలన్ని నీరు ముంచెత్తడంతో అధికారులు ఎగువ నుంచి ప్రవాహాన్ని తగ్గించారు. ఇదేసమయాన ఆంధ్రాకు వెళ్లే రెగ్యులేటరీ గేట్లు తెరవడంతో పంట పొలాల్లో నీరు తగ్గింది. ఆపై సోమవారం గండి పూడ్చించగా... కెనాల్ పక్కన నీరు చేరిన పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

మధిర: ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తాకడంతో మహిళ మృతి చెందిన ఘటన మధిర దళిత కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. కాలనీకి చెందిన పగిడిపల్లి నీలమ్మ(60) ఇంటి స్లాబు పెచ్చులు ఊడి పడుతుండడంతో ఎప్పుడేం జరుగుతోందనన్న భయంతో సమీపంలోని చర్చిలో నిద్రిస్తోంది. అయితే, స్లాబ్ పెచ్చులు ఊడిపడగా ట్యూబ్ లైట్ విద్యుత్ వైరు తెగింది. ఈ విషయాన్ని గమనించని నీలమ్మ ఇంటి ముందు ఉన్న ఇనుప మంచాన్ని లోనకు తీసుకెళ్తుండగా వైర్‌కు తాకడంతో విద్యుదాఘానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై మధిర టౌన్ ఎస్సై కిషోర్ కుమార్ కేసు నమోదు చేశారు.

మద్యం కోసం వెళ్లిన వ్యక్తి...

నేలకొండపల్లి: మత్తులో మద్యం కోసం వెళ్లిన ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. మండలంలోని కోనాయిగూడెంకు చెందిన బొడ్డు పిచ్చయ్య(54) ఆదివారం రాత్రి స్థానిక ఓ షాప్ వెనకాల రేకు తొలగించి మద్యం సీసా తీసుకునే ప్రయత్నంలో ఇన్వర్టర్‌పై పడినట్లు తెలిసింది. దీంతో షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందగా ఆయన భార్య కరుణ ఫిర్యాదుతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు.

అపార్ట్‌మెంట్‌లో పట్టపగలే చోరీ

- రూ.17లక్షల మేర సొత్తు అపహరణ

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో సోమవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ఖమ్మం బైపాస్ రోడ్డు ప్రాంతంలోని బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్తులో సీపీఎం నాయకులు దేవేందర్, ఝాన్సీ నివాసం ఉంటున్నారు. ఝాన్సీ అమెరికాలోని పిల్లల వద్దకు వెళ్లగా దేవేందర్ తాళం వేసి బయటకు వెళ్లి వచ్చే సరికి తాళం పగులగొట్టి ఉంది. లోపల పరిశీలించగా రూ.15లక్షలకు పైగా విలువైన బంగారం, రూ.2లక్షల నగదు, ఓ కెమెరా కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించారు. ఇదిలా ఉండగా బైక్‌పై వచ్చిన ముగ్గురిలో ఒకరు రోడ్డుపై నిలబడగా మిగతా ఇద్దరు అపార్ట్‌మెంట్ లోనకు వచ్చి లిఫ్ట్‌లో దేవేందర్ ఫ్లాట్‌కు చేరుకుని తాళం పగులగొట్టి చోరీ చేసినట్లు సీసీ పుటేజీ ద్వారా పోలీసులు గుర్తించారని సమాచారం. దీంతో అన్నీ తెలిసిన వారే రెక్కీ చేశాక చోరీకి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈమేరకు ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ, సీసీఎస్, క్లూస్‌టీమ్ సిబ్బంది పరిశీలించి ఆధారాలు సేకరించడంతో పాటు దర్యాప్తు ప్రారంభించారు.

చోరీ కేసులో ఆరు నెలల జైలుశిక్ష

కల్లూరు: ట్రాక్టర్, ట్రక్కు చోరీ కేసులో నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ సత్తుపల్లి అదనపు ప్రథమశ్రేణి న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కల్లూరు మండలం చెన్నూర్ పెట్రోల్ బంక్ వద్ద ఈ ఏడాది జూన్ 8 వ తేదీన చెన్నూరుకు చెందిన చింతలపాటి సుబ్బారావు ట్రాక్టర్, ట్రక్కు చోరీ జరిగింది. ఘటనపై ఎస్ఐ హరిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా చింతకాని మండలం వందనం గ్రామానికి చెందిన కాకరకాయల నరేష్‌ను నిందితుడిగా గుర్తించి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం నరేష్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారని ఎస్ఐ హరిత వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ జె.ప్రదీప్ వాదించగా, కల్లూరు కానిస్టేబుల్ మల్లికార్జున్ సహకరించారు.

కాశ్మీర్ లోయలో ప్రమాదం...

- ఆర్మీ జవాన్, జిల్లా వాసి మృతి
- ట్రక్కు లోయలో పడడంతో ఘటన



అనిల్‌కుమార్ (ఫైల్)

కారేపల్లి: కారేపల్లి మండలం సూర్యతండా గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బానోతు అనిల్‌కుమార్(30) కాశ్మీర్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. విధుల్లో భాగంగా ఆయన సోమవారం కాశ్మీర్ లోయ ప్రాంతంలో వెళ్తుండగా ట్రక్కు లోయలో పడినట్లు తెలిసింది. అనిల్ సహా మరికొందరు ఆర్మీ జవాన్లకు గాయాలు కాగా, ఆయనకు ఆర్మీ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడని అక్కడి అధికారులు అనిల్ సోదరుడు ప్రసాద్‌కు సమాచారం ఇచ్చారు.

చిన్నప్పటి నుంచే దేశసేవపై మక్కువ..

ఇంటర్మీడియట్ చదివిన అనిల్‌కుమార్‌కు చిన్నప్పటి నుంచి ఆర్మీలో ఉద్యోగం సాధించి దేశసేవ చేయాలని లక్ష్యంగా ఉండేదని స్థానికులు తెలిపారు. 2012లో ఆర్మీలో చేరిన అనిల్ మరో రెండేళ్లయితే రిటైర్డ్ అయ్యేవాడని తెలిసింది. ఆయన తండ్రి మంగీలాల్ కేన్సర్ బారిన పడగా కాపాడేందుకు ఆర్మీ హాస్పిటల్‌లో అనిల్ చికిత్స చేయించినా ఫలితం దక్కక ఏడాది క్రితం మృతి చెందాడు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన అనిల్‌కు భార్య రేణుక, ఎనిమిది నెలల కుమారుడితో పాటు సోదరుడు ప్రసాద్, ఒక సోదరి ఉన్నారు. కాగా, అనిల్ మృతదేహాన్ని మంగళవారం విజయవాడ ఎయిర్‌పోర్ట్‌లో కుటుంబీకులకు అప్పగించనుండగా, అక్కడి నుంచి గ్రామానికి తీసుకొస్తారు. ఈ మేరకు ఆయన భార్య రేణుక, కుటుంబ సభ్యులకు సమాచారం అందింది.